క్లుప్తంగా

ఇన్‌చార్జి కార్యదర్శిగా శ్రీనివాసు



ఎంపీ భరత్ రామ్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శిగా డి.శ్రీనివాసు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆంజనేయులు నరసరావుపేటకు బదిలీ కావడంతో శ్రీనివాసును ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

27, 28 తేదీల్లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు



కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ర్యూన్సీ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం సెయింట్ ఆన్స్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఈనెల 27, 28 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ ర్యూన్సీ తెలిపారు. పాఠశాల మేనేజ్‌మెంట్ స్టాఫ్ అండ్ స్టూడెంట్స్ అల్యూమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల వివరాలను స్థానిక గురుకులం రోడ్డులోని స్కూల్లో ప్రిన్సిపాల్ ర్యూన్సీ, అల్యూమ్ని అసోసియేషన్(పూర్వ విద్యార్థుల సంఘం) కోశాధికారి కోడి ప్రవీణ్ కుమార్ శనివారం వెల్లడించారు. సుమారు 2,500 నుంచి 3 వేల మంది వరకూ పూర్వ విద్యార్థులు హాజరవుతున్నారన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వాక్య సందేశాన్నందిస్తున్న విమలా ఏసురత్నం

కడియం: పొట్టిలంకలోని బైబిలు మిషను సెయింట్ దేవదాసు పెనుయేలు ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాల్ దొరబాబు కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వర్తమానికులు విమలా ఏసురత్నం ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ సందేశాన్నందించారు. కేండిలైట్ సర్వీస్ అనంతరం ప్రముఖులు వాక్యసందేశాన్నందించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.రత్నరాజు పాల్గొన్నారు.

26 నుంచి పీజీ స్పాట్ అడ్మిషన్లు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 26 నుంచి 29 వరకూ పీజీ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ తెలుగు 50, కామర్స్ 45, ఎకనామిక్స్ 33, పొలిటికల్ సైన్స్ 27, మేథమెటిక్స్ 29, ఫిజిక్స్ 30, కెమిస్ట్రీ 5, బోటనీ 26, జువాలజీ 20, కంప్యూటర్ సైన్స్ 10, అక్వాకల్చర్ 4, జియాలజీ 33 ఖాళీలున్నాయన్నారు. ఏపీపీజీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావును సంప్రదించాలన్నారు.

ముస్లింలపై నోరు జారితే సహించం



మహ్మద్ ఆరిఫ్

ప్రకాశం నగర్: మైనారిటీల మనోభావాలు దెబ్బతినేలా తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సంహించేది లేదని టీడీపీ నాయకులను వక్ఫ్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ హెచ్చరించారు. జాంపేటలోని తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు ఇమామ్ సాహెబ్‌పై టీడీపీ అఫీషియల్ వెబ్‌సెట్‌లో ఆయనను తాలిబాన్లతో పోలుస్తూ ముస్లింల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రతిసారి ముస్లింలపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం, అణిచివేసే చర్యలు తీసుకోవడం తెలుగుదేశం పార్టీకి పరిపాటిగా మారిందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వాగ్దానాలు అమలు చేయాలని శాంతియుతంగా ప్లకార్డులు ప్రదర్శించిన మైనార్టీ యువకులపై దేశద్రోహం కేసులు పెట్టి జైలుకు పంపించారని గుర్తు చేశారు. ముస్లింలపై జరుగుతున్న తెలుగుదేశం దాడులపై త్వరలోనే మైనారిటీ కమిషన్‌ను ఆశ్రయిస్తామన్నారు. సదరు వెబ్‌సైట్ నుంచి ఆ వ్యాఖ్యలను తొలగించాలని డిమాండ్ చేశారు.

ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం

- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనం



లాలాచెరువు గోవింద క్షేత్రంలో గోదాదేవి, వేంకటేశ్వరస్వామి

సీటీఆర్‌ఐ: ముక్కోటి ఏకాదశికి రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లోని వైష్ణవాలయాలు సిద్ధమయ్యాయి. స్వామివారు శనివారం ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధన అనంతరం వైకుంఠ ఏకాదశిని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. వైకుంఠ ద్వారాలను తెరచి పూజలు చేయనున్నారు. వేకువజామునుంచే భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. స్వామి వారికి పూలంగి సేవ, పాశురహారతి, ఉత్తర ద్వారదర్శనం, సహస్రనామార్చన, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ నిర్వహిస్తారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం ఆవరణలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రం, దేవీచౌక్‌లోని మఠం వీధి వేంకటేశ్వర ఆలయం, సీతంపేట రామాలయం, నల్లమందు సందులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, గోదావరి గట్టున గల వేణుగోపాలస్వామి క్షేత్రం, ఇస్కాన్ టెంపుల్, వంకాయలవారి వీధిలో అష్టలక్ష్మి ఆలయం, శ్రీరంగనాథ ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

తిరుపావై ప్రవచనాలు

ధనుర్మాస మహోత్సవాల సందర్భంగా లాలాచెరువులోని గోవింద క్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానాలు, ఆళ్వార్ దివ్యబంధ ప్రాజెక్ట్‌లో భాగంగా గోవింద క్షేత్రంలోని ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీమాన్ శ్రీమన్నారాయణచార్యులును తిరుపావై ప్రవచనలు చెప్పడానికి నియమించారు.

> **శుభ ఫలితాలు**
>
> 
>
> ఈ ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానం. ధనుర్మాసంలో వచ్చే ఏకాదశి మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైంది. ఈ వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠ ఏకాదశి వ్రతం ఆచరించిన వారికి శుభ ఫలితాలు కలుగుతాయి.
>
> శ్రీమన్నారాయణాచార్యులు,
> గోవిందక్షేత్రం ప్రధాన అర్చకుడు

పార్లమెంట్‌లో ఎంపీల సస్పెన్షన్ దారుణం

రాజమహేంద్రవరం సిటీ: పార్లమెంట్‌లో పొగ బాంబులు వేసిన ఆగంతకులపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్న ఇండియా కూటమి పక్ష పార్టీల ఎంపీలను పార్లమెంట్‌లో సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్యని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్ ధ్వజమెత్తారు. శుక్రవారం నగరంలో జాంపేటలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆ కూటమిలోని సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్. న్యూడెమోక్రసీ, ఆప్ పార్టీలు నిరసన చేపట్టాయి. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ముళ్ల మాధవ్, ఆకుల భాగ్య సూర్యలక్ష్మి, పీసీసీ సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, బెజవాడ రంగారావు పాల్గొన్నారు. అలాగే పార్లమెంట్ నుంచి కాంగ్రెస్‌తో సహా విపక్షాలకు చెందిన సభ్యులను సస్పెండ్ చేసి అనైతిక పాలన సాగిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పట్నాల శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. స్థానిక గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం దగ్గర నిరసన చేపట్టారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడాపరికరాల ఆవిష్కరణ



కడియంలో క్రీడా పరికరాలను ఆవిష్కరిస్తున్న గిరజాల బాబు, భీమిరెడ్డి నాగేంద్ర



జేగురుపాడులో ఆవిష్కరిస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్ తదితరులు

కడియం: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గ్రామ సచివాలయాల స్థాయిలో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లోనూ క్రీడా పరికరాలను శుక్రవారం ప్రజాప్రతినిధులు, నాయకులు ఆవిష్కరించారు. కడియం ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గిరజాల బాబు మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సీఎం జగన్ ఈ క్రీడా పోటీలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

- జేగురుపాడులో పార్టీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ క్రీడా పరికరాలు, టీ షర్టులను ఆవిష్కరించారు. గ్రామం నుంచి క్రికెట్ పోటీల్లో ఎనిమిది, వాలీబాల్‌లో నాలుగు, బ్యాడ్మింటన్‌లో నాలుగు, కబడ్డీలో నాలుగు జట్లు పాల్గొంటున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి బి.శిరీష, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు

- ఎంపీ భరత్ రామ్
- 5వ డివిజన్‌లో 'గుడ్ మార్నింగ్'



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని పారిశుధ్య సిబ్బంది, అధికారులకు ఎంపీ భరత్ రామ్ ఆదేశించారు. స్థానిక 5వ డివిజన్‌లో శుక్రవారం గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. కంబాలపేట ఏరియాలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైకి మురుగునీరు పొంగిపొర్లుతున్నా పట్టించుకోకపోవడంపై ఆర్ఎంసీ శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడటం సహించేది లేదన్నారు. మరోసారి ప్రజల నుంచి డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు రాకుండా తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న చిరు వ్యాపారులకు న్యాయం చేయకుంటే ఎలా అని మెప్మా అధికారులపై,, శానిటేషన్ విషయంలో ఆర్ఎంసీ సంబంధిత శాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులకు ఇప్పటి వరకూ మెప్మా అధికారులు మంజూరు చేయలేదని ఎంపీకి మొరపెట్టుకున్నారు. ఈ విషయమై మెప్మా అధికారి రవిశంకర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఏడాదిగా చిరు వ్యాపారులకు రూ.10 వేల రుణం ఇప్పించకపోవడంతో ఆగ్రహ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కుక్కా తాతబ్బాయి, ఎంహెచ్‌ఓ వినూత్న, ఈఈ శేషగిరి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



గణిత దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణాసంస్థ(డైట్)లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం వైభవంగా జరిగింది. డైట్ అధ్యాపకుడు కొమ్ముల వెంకట సూర్యనారాయణ 12 మంది ప్రముఖ భారతీయ మహిళా గణిత వేత్తలతో రూపొందించిన డైట్ – 2024 కేలండర్ ఆకట్టుకుంది. అలాగే ఛాత్రోపాధ్యాయినులు రూపొందించిన రామానుజన్ సంఖ్య 1729 కూడా అలరించింది. ప్రాటొగరస్–యుతలస్ పారడాక్స్‌పై ఛాత్రోపాధ్యాయులు హిమ, ఆదర్శని, లహరి వేసిన స్కిట్, శకుంతలాదేవిపై అఖిల ప్రదర్శించిన స్కిట్ ఆకట్టుకుంది. గణిత క్విజ్‌లో ప్రథమ బహుమతి పొందిన టీమ్‌కి గణిత పుస్తకాలను బహుమతులుగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ అందజేశారు. కార్యక్రమంలో సుజాతారత్నం, జానకీదేవి, సత్యనారాయణ, బాలరాజు, ఎస్తర్, కళావతి పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ రమణ

రాజమహేంద్రవరంలో..

కంబాలచెరువు: దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు గణిత అంశాలను హెచ్‌ఎం ఎస్.రాజా ప్రశాంత్ పరిశీలించారు. విజేతలైన శ్రీవల్లి, హర్షిత, అఖిల్, కిరణ్, యశ్వంత్, సబీర్‌ను అభినందించి బహుమతులను అందజేశారు.

- స్థానిక కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం పులుగుర్త దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రామానుజన్ స్ఫూర్తిని విద్యార్థులు, పరిశోధకులు పుణికిపుచ్చుకోవాలన్నారు. గణితంలో మెళకువలు నేర్చుకుంటే మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థినులు శ్రేష్ఠ, గగన చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మండల స్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన రోహిత్, విధాత్రి, వినయనిలను ఉపాధ్యాయులు అభినందించారు.

పారదర్శకంగా జగన్ పాలన



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



వేమగిరిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న చక్రవర్తి

రాజమహేంద్రవరం సిటీ: పారదర్శక పాలనకు ప్రతీకగా జగనన్న ప్రభుత్వం నిలుస్తుందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 11వ డివిజన్‌లోని 24వ నంబర్ తోట రాములు నగర్ సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సచివాలయం పరిధిలోని లబ్ధిదారుల ఖాతాల్లో సుమారు 12.07 కోట్లు జమ అయ్యాయన్నారు. రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, క్లస్టర్ ప్రెసిడెంట్లు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, నగర ఎస్సీసెల్ చైర్మన్ కాటం రజనీకాంత్ పాల్గొన్నారు.

వేమగిరిలో..

కడియం: వేమగిరి సచివాలయం – 4లో వై ఏపీ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి తదితరులు ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి చేపట్టిన వివిధ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ లక్ష్మి, పార్టీ నాయకులు గుబ్బల నాగార్జున, పితాని శ్రీనివాస్, నరాల శ్రీను, పితాని హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల దాడులు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఉన్నతాధికారుల సూచనలపై శుక్రవారం దాడులు నిర్వహించినట్లు యాంటీ పవర్ తెఫ్ట్ స్క్వాడ్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. మండపేట మండలం కేశవరంలో తనిఖీలు నిర్వహించగా ఇంటికి మీటరు బైపాస్ చేసి విద్యుత్ చౌర్యం చేస్తున్నట్టు గుర్తించామన్నారు. నిందితుడికి రూ.73,044 జరిమానా, రూ.3,000 అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

గైట్‌లో సదస్సు

రాజానగరం: దేశంలో నిరుద్యోగ సమస్యకు ప్రధాన కారణం ఉద్యోగాలు లేకపోవడం కాదని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అభ్యర్థులలో లేకపోవడమేనని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. బహుళ విభాగ పరిశోధన, ఆవిష్కరణలు అనే అంశంపై శుక్రవారం గైట్ డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ అయిన వెంటనే క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, పైథాన్ వంటి కోర్సులను అభ్యసించాలన్నారు. అలాగే పరిశోధనలపైనా దృష్టిని సారించాలన్నారు. ఆలిజోల్ టెక్నాలజీస్ సీఈఓ పవన్ చలమలశెట్టి, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

రాజానగరం: అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందిన గొల్లవల్లి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంత్యక్రియలు కూడా చేయలేని దుర్భరస్థితిలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచిన స్థానిక 2వ వార్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రగడ ఛక్రి జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ సహకారంతో రాజమహేంద్రవరంలోని కైలాసగిరిలో అంత్యక్రియలు చేయించారు.

'వందే భారత్' ఇంజిన్‌లో సాంకేతిక లోపం


సుమారు 2.40 గంటల ఆలస్యం



కొవ్వూరులో నిలిచిపోయిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్

రాజమహేంద్రవరం సిటీ: ఇంజిన్‌లో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న వందేభారత్ (20834) ఎక్స్‌ప్రెస్ రైల్ కొవ్వూరు– పసివేదల గ్రామాల మధ్య నిలిచిపోయింది. రైలు నడిచే అవకాశం లేకపోవడంతో శుక్రవారం రాత్రి 8.45 గంటల నుంచి సుమారు రెండున్నర గంటల పాలు అక్కడే నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విజయవాడ డివిజన్ రైల్వే ఉన్నతాధికారులు వెంటనే అప్రమత్తం అయ్యారు. వారి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం రైల్వే అధికారులు ఇక్కడి నుంచి రెండు ప్రత్యేక ఇంజిన్‌లను కొవ్వూరు తరలించి రైల్‌ను రాజమహేంద్రవరం స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఇదే పద్ధతితో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను విశాఖపట్నం వరకూ తీసుకుని వెళ్లేలా ఏర్పాటు చేసినట్టు స్టేషన్ మేనేజర్ రంగనాథ్ వెల్లడించారు. రాత్రి 9 గంటలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు చేరుకోవాల్సిన ఈ రైలు 2.40 గంటల ఆలస్యంగా 11.40 గంటలకు ఇక్కడకు చేరుకుంది. పది నిమిషాల అనంతరం 11.50 గంటలకు ఇక్కడి నుంచి విశాఖకు బయలు దేరింది.

పడాల శతజయంత్యుత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ కర్రి రామారెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కందుకూరి వీరేశలింగం ఆస్తిక డిగ్రీ కళాశాలలో 2024 జనవరి ఆరున స్వాతంత్య్ర సమరయోధుడు, శతాధిక గ్రంథకర్త పడాల రామారావు శత జయంత్యుత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ (న్యూఢిల్లీ), అరసం జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాల పోస్టర్‌ను స్థానిక మానస హాస్పటల్లో శుక్రవారం ఆవిష్కరించారు. డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ పడాల రామారావు పేద చేనేత సామాజిక వర్గంలో జన్మించి, స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నారన్నారు. జైల్లో ఉండగానే ఖైదీ నవలతో రచనలకు శ్రీకారం చుట్టి, 100కు పైగా గ్రంథాలను రచించారన్నారు. కార్యక్రమంలో అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, కార్యవర్గ సభ్యులు మల్లెమొగ్గల గోపాలరావు, బూడిద వీర్రాజు, పడాల సోమశేఖరరావు, రమాదేవి, పడాల రమేష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజా

రాజానగరం: రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని దివాన్ చెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. విద్యతోనే పేద కుటుంబాలలో ఆర్థిక పరిస్థితులు మారతాయని నమ్మిన ముఖ్యమంత్రి.. అందుకు అనుగుణంగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. ఉన్నత విద్య అందరికీ అందించేలా అనేక పథకాలను అమలు చేస్తూ, ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి ప్రసాద్, ఉపాధ్యాయులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మండారపు వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వరరావు, కోలాటి వెంకన్న, వేమగిరి కృష్ణ, అడబాల చిన బాబు, యర్రంశెట్టి ధర్మరాజు, పలివెల స్వామి, దూడల నాగేశ్వరరావు, గంధ్రి నానబ్బులు, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో మహిళల ఆర్థికాభ్యున్నతి



సర్టిఫికెట్లు అందజేస్తున్న జితేంద్ర

రాజమహేంద్రవరం సిటీ: మహిళల ఆర్థిక అభ్యున్నతికి నైపుణ్య శిక్షణ ఎంతో దోహదపడుతుందని నగర పాలక సంస్థ పూర్వపు కమిషనర్ జితేంద్ర అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర కుట్టు, మగ్గం వర్క్ శిక్షణా కేంద్రంలో శుక్రవారం 69వ బ్యాచ్ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జితేంద్ర మాట్లాడుతూ ఇంటిలోనే మగ్గం, కుట్టు పని ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు రాంబాబు మాట్లాడుతూ 25 ఏళ్లుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరఫున కంప్యూటర్, కుట్టు, మగ్గం వర్క్‌లో సుమారు 16,590 మందికి ఉచిత శిక్షణ అందించామన్నారు. అనేక మంది క్రాఫ్ట్ టీచర్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారని, కొందరు స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా మెటీరియల్, మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరిస్తామన్నారు. నూతన బ్యాచ్ శిక్షణ డిసెంబర్ 27 నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తికల మహిళలు 98498 47489 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

హిందూధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

గోకవరం: హిందూ మతం ఒక జీవన విధానమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సీఎండీకేఎస్పీ సంస్థ అధినేత కంబాల శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ ఆర్అండ్ఆర్ కాలనీలో శుక్రవారం హిందూ ధర్మ పరిరక్షణపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతమార్పిడులు కారణంగా హిందూ మతం ప్రమాదంలో పడిందన్నారు. హిందువులు సంఘటితమై హిందూధర్మాన్ని పరిరక్షించాలన్నారు. హిందూమత పరిరక్షణకు అవసరమైతే ఆర్థికంగా సహకారం అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రతినిధులు ఆయా గ్రామాల్లో దేవాలయాల పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకురాగా తగిన సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. తొలుత దేవీచౌక్ ఆలయం నుంచి ఆర్అండ్ఆర్ కాలనీ వరకూ హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వరసాల ప్రసాద్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	సలార్
సూర్యమినీ	డంకీ
సూర్యప్యాలెస్	సలార్
స్వామి	సలార్
శివజ్యోతి	సలార్
అనుశ్రీ	ఆక్వామేన్
రాజా	సలార్
అశోక	సలార్
ఊర్వశి	సలార్
రంభ	సలార్
మేనక	సలార్
అప్సర	సలార్
నామవరం	
వీఎస్ మహల్	సలార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	సలార్
కడియం	
వెంకటసూర్య	సలార్